# అమ్మ చచ్చిపోతే బావుణ్ణు

యావద్విత్తో పార్జన స్తక
స్తావన్నిజ పరివారో రక్తః
పశ్చా జ్జీవతి జర్జర దేహే
వార్తాంకో పిన పృచ్ఛతి గేహే.

నీవు సంపాదన పరుడవై ఉన్నంతవరకు నీవారంతా నిన్నాశ్రయించి ఉంటారు. వృద్ధాప్యమున నీ దేహము శిథిలమై, శక్తి హీనమైనపుడు నీ ఇంటిలోని వారే నిన్ను పలకరించరు.

- భజగోవిందం

"కాలం మారిపోయింది ఏవిటో!" అని నిట్టూర్చిన వాళ్ళని నిలువులోతు పాతెయ్యాలి,

కాలం మారడవేఁవిఁటి?

వాళ్ళ పిండాకూడు.

ఏదో ఒకటి అనాలి కాబట్టి అనడం.

ఎప్పుడూ వారానికి ఏడు రోజులే.

రోజుకి ఇరవై నాలుగ్గంటలే.

సూర్యుడు ఇంకా తూర్పునే ఉదయిస్తున్నాడు.

మారింది కాలం కాదు.

మనుషులూ వాళ్ళ మనస్తత్వాలు.

టి.వి.లు, వీడియోలు, కంప్యూటర్లు, రాకెట్లు, ఇవన్నీ సైన్సు అభివృద్ధి.

మన మనసులు మాత్రం ఇంకా పాతరాతి యుగం దాటలేదు.

రాకెట్‌తో చంద్రమండలానికి వెళ్ళినా అక్కడ రాళ్ళు పెట్టి కొట్టుకుంటారు.

లేకపోతే అక్కడ పాతిన జెండా కర్రలు పీకి వాటితో కొట్టుకుంటారు.

అలనాటి పాత రాతియుగంలో కేవలం తిండికోసం మాత్రవేం కొట్టుకున్నారు.

ఇప్పుడు పెన్షలు మొదలు ప్రేమ వరకు, ఓటు మొదలు నోటు వరకు అన్నిటికీ కొట్టుకుంటున్నాం.

చంపుకోవడం మన హాబీ.

ప్రతీకారం మన ప్రాణం.

డబ్బు మన ఊపిరి.

డబ్బు ఏలే రాజ్యంలో మానవత్వం మనలేదు.

ఈ నేపథ్యంలో ఒక నిస్సహాయకారి ఆవేదన....

అమ్మ చచ్చిపోతే బావుణ్ను.

ఔను.

అమ్మ చచ్చిపోతే బావుణ్ను.

ఏ రాక్షసులూ తల్లి చావు కోరరు.

ఏ దుర్మార్గుడూ తల్లి చావు కోరడు.

ఎవరైనా తల్లి సుఖమే కోరుతారు.

నేనూ మా అమ్మ సుఖమే కోరుతున్నాను.

ఔను.

ఆవిడ సుఖపడాలి.

అదొక్కటే నా కోరిక.

అదే నా ఆశ.

కాని – సుఖమంటే...

పట్టుపరుపులూ, పరమాన్నాలూ –

కార్లూ, కంచిపట్టు చీరలూ కావు.

ఏ మనిషికైనా కావలసింది

మనశ్శాంతి.

అదే కరువైపోయేక మరింక సుఖం ఎక్కడుంది?
ప్రతి నిమిషం
అవమానం భరిస్తూ
రేపు ఎలా ఉంటుందో తెలీక,
ఈ రోజు గడిస్తే చాలన్న ఆత్మవంచనతో
నీ ఉనికే భరించలేని మనుష్యుల మధ్య,
ఎప్పుడు చచ్చిపోతుందా అని ఎదురు చూసే రాబందుల మధ్య,
నీ చావుని పండుగ జరుపుకునే పశువుల మధ్య,
ఎన్నాళ్ళు?
ఎన్నేళ్ళు?
బతకడం?!
**ఒద్దమ్మా, ఒద్దు.**
ఇలాంటి బతుకు అక్కర్లేదు,
ఈ కష్టాలు, కన్నీళ్ళు,
అవమానాలు, ఆశాభంగాలు
లేని మరో ప్రపంచానికి వెళ్ళిపోవాలి.
అందుకే కోరుకుంటున్నాను.
మా అమ్మ చచ్చిపోతే బావుణ్నని.
గులాబీ రేకుల పరుపుమీద
మల్లెతీగల ఉయ్యాలలో పెరిగిన
నీకా తల్లీ ఈ కష్టాలు!
ఏవి తల్లీ ఆ గులాబీ రేకులు?
ఆ మల్లెతీగలేవీ?
కట్టుకున్నవాడు గుండెల్లో దాచుకున్నాడే!
కంటి రెప్పల్లో పొదువుకున్నాడే!
ఏమైపోయేడు ఆ మానవుడు?
కాటిలో కాలిపోయేడు.
నీ కడుపు పంట లేవీ?

నీ కడుపులో మంటలు రేపి,

నీ గుండెలో గునపాలు గుచ్చి

మట్టిలో కలిసిపోయేరా!

మోడైపోయిన నీ జీవితంలో

ఇంకా కన్నీరుందా అమ్మా!

ఒద్దమ్మా, ఒద్దు.

కన్నతల్లి కోసం ఒక కమ్మని మాట కూడా అనలేని ఈ కిరాతకుల కోసం

కన్నీరు ఖర్చు చెయ్యకు.

"అయ్యో, అమ్మ బతికినన్నాళ్ళు బతకదు, వచ్చే ఏడు చూస్తానో చూడనో, ఈ పుట్టినరోజు నాడు వెళ్ళి విష్ చేద్దాం" అన్న ఇంగిత జ్ఞానం లేకుండా, ఇరవై రూపాయలకి కక్కుర్తిపడిన కొడుక్కోసం ఎందుకమ్మా నీ కన్నీరు వృధా చేస్తావు?

ఒద్దమ్మా, ఒద్దు

శ్రీ శ్రీ చెప్పినట్టు ఏడువకు. ఏడవకు,

నేనున్నా, నేనున్నా.

నా గుండె చప్పుడున్నంతవరకు నిన్ను గుండెలో దాచుకుంటాను.

నా చూపు ఉన్నంతవరకు నా కనురెప్పల మధ్య కాపాడుతాను.

కాని... కాని...

అభిమానంలో అపశృతి.

నన్నుకట్టుకున్న వాడూ కాటిలోనే ఉన్నాడు.

రేపు నా బతుకూ ఇంతేనా?

మొన్న నీ మనమరాలు నిన్నేమని అడిగింది!

"నువ్వింకా ఎందుకున్నా"వని కదూ!

వెయ్యి జన్మలైనా వెంటాడే మాట.

అప్పుడు నాకేమనిపించిందో తెలుసా?

ఓ గ్లాసుడు నీళ్ళలో పిడికెడు నిద్ర మాత్రలు వేసి, నీకో సగం ఇచ్చి, నేనో సగం తాగెయ్యాలని పించింది.

చచ్చి ఏం సాధిస్తారంటారు.
బతికి వీళ్ళ సాధింపులు వినాలికదా
మన రెక్కలు విరిచి వాళ్ళకి అతికేం
ఆ రెక్కలే మనకి నీడ ఇస్తాయని నమ్మేం
కాని ఆ రెక్కలు ఎగిరిపోవడానిక్కూడా పనికొస్తాయి.
చ! ఏడుస్తున్నావా? తప్పు,
తప్పు వాళ్ళది కాదు,
తప్పంతా మనదే.

ఇలాంటి నికృష్టపు మనసులున్న మనుషుల్ని కనడం మనం చేసిన తప్పు.

తప్పుకి శిక్ష ఉండాలి కదా.
మన దీపం కదా అని ముద్దుపెట్టుకుంటే మూతి కాలదా!
అమ్మా!
నువ్వు జన్మల్ని నమ్ముతావుకదూ
దేవుడ్ని కూడా నమ్ముతావు కదూ.
నువ్వు నమ్మే దేవుడ్ని
ఒకే ఒక్క వరం కోరుకో.
మళ్ళీ జన్మంటూ ఉంటే,
అది ఆడజన్మే అయితే,
గొడ్రాలిగా పుట్టాలని కోరుకో,
"మాతృత్వం వరం" అన్నది ఆత్మవంచన,
మాతృత్వం ఒక శాపం,
పిడికెడన్నం పెట్టని ఈ స్వార్థపరులు మనకొద్దు.

పుట్టేది ఆడపిల్లని తెలిసి కడుపులోనే చంపేస్తున్న కిరాతకుల మధ్య మనం బతకలేం.

ఒద్దమ్మా ఒద్దు.
వేగం వెళ్ళిపో.
అప్పుడే మనిద్దరికీ మనశ్శాంతి.

★ ★ ★